janodaya

# జనోదయ

RNI No - APTEL/2022/81596

కరీంనగర్ గురువారం 08.01.2026 సంపుటి : 03 సంచిక : 38 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Thursday 08.01.2026 Volume: 03 Issue 38 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## కుక్కకాట్లపై సుప్రీం ఆందోళన



6

జంతువుల సంఖ్య నియంత్రణకు అధికారయంత్రాంగం విఫలం

## ఖమ్మం మంత్రులు ముగ్గురిదీ కమీషన్‌ల కక్కుర్తే



6

## సచిన్ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు



5

## మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో



5


## రాంజీ నీడలో అక్షర సేద్యం



4

# మున్సిపల్ ఎన్నికలపై కసరత్తు

### ఎస్ఈసీ కీలక ప్రకటన




తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. అందుకోసం బుధ వారం జిల్లా కలెక్టర్లు మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి12వ తేదీలోపు ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది.

5

# ఊపిరితిత్తులకు సెగ

### వాయు కాలుష్యం, ధూమపానంతో ముప్పు

### ఎండలో ఉంచిన వాటర్ బాటిళ్లతో క్యాన్సర్

### ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి



**సంగారెడ్డి , జనవరి 7 :**

దేశంలోని నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యం, ధూమపానంతో ఊపిరితిత్తులకు ఎక్కువ ప్రమాదం పొంచి ఉందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులే రెండో అతి పెద్ద అనారోగ్య సమస్యగా ఉందన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను విరివిగా వినియోగిస్తున్నారని, వాటిని ఎండలో ఉంచడం వల్ల మైక్రో ప్లాస్టిక్ కణాలు పెరుగుతాయని, ఆ నీటిని తాగితే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ముప్పు ఉందని హెచ్చరించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లంగ్ హెల్త్ (ఐఎల్‌హెచ్) భాగస్వామ్యంతో ఊపిరితిత్తుల సమస్యలపై పరిశోధనకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యులు ఊపిరితిత్తుల మార్పిడి చేస్తున్నారని, ఐఎల్‌హెచ్-ఐఐటీహెచ్ బయో ఇంజనీరింగ్ విభాగాలు ప్రారంభించిన ఈ కేంద్రంలో ఇండో-జర్మన్ శాస్త్రవేత్తలు మూలకణాలతో కొత్త ఊపిరితిత్తులు సృష్టించేందుకు పరిశోధనలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కేంద్రంతో రానున్న ఐదేళ్లలో చాలావరకు ఊపిరితిత్తుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనాతో వచ్చిన శ్వాస సమస్యలతో ఊపిరితిత్తుల ప్రాధాన్యత ప్రపంచానికి తెలిసిందన్నారు. వాయు కాలుష్యాన్ని నివారించాల్సి అవసరం ఉందన్నారు. నిత్యం యోగా, శ్వాస సంబంధిత వ్యాయామాలు, గదుల్లోకి వెలుతురు ద్వారా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. ఊపిరితిత్తుల పునరుత్పత్తి, మార్పిడిపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఐఎల్‌హెచ్ డైరెక్టర్ వెర్నర్ సీగర్ అన్నారు.



## 19న మేడారానికి సీఎం రేవంత్ రెడ్డి

### జనవరి 28 నుండి 31 వరకు మహా జాతర

మేడారం జాతర ఈనెల 28 నుండి 31 వ తేదీల వరకు జరుగుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 19వ తేదీన ఉదయం ఆలయ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

7

## ఏప్రిల్ 1 నుంచి జనగణన

### సెప్టెంబర్ 30 వరకు హౌస్ లిస్టింగ్

### 15 రోజుల ముందు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు అవకాశం

### కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్



జనాభా లెక్కలు, 2027 తొలి దశ ( హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ ) ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీని కోసం ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతం 30 రోజుల గడువును ప్రకటిస్తాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

8

# చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా

### క్లీన్ స్వీప్ చేసిన భారత్




దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌ను యువ భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన చివరి వన్డేలో టీమిండియా 233 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. భారత్ ఓపెనర్లు శతకాలతో చెలరేగడంతో సఫారీ జట్టు ముందు భారత్ భారీ టార్గెట్ ఉంచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 393 పరుగులు చేసింది. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ (127) మరోసారి విధ్వంకర ఇన్నింగ్స్ ఆడి సూపర్ సెంచరీ సాధించాడు. అలానే మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118) కూడా శతకం బాదాడు.

8

# గ్రామాభివృద్ధే ధ్యేయం


### పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచాల మధు



**జనోదయ, మందమర్రి జనవరి 7:**
ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామస్థులకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీని అమలు చేసి గ్రామస్తుల మన్ననలు పొందాడు పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచాల మధు. మండలంలోని పొన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని మాల కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి బోరు చెడిపోయి నెల రోజులకు పైగా కాలని వాదులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను గెలిచిన వెంటనే బోరు మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి కట్టుబడి బుధవారం బోరుకు మరమ్మతులు చేపట్టి కాలనీ వాసుల నీటి కష్టాలను తీర్చాడు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంచాల మధు మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాలనీ వాసుల నీటి ఇబ్బందులు తీర్చేందుకు బోరు మోటర్ మరమ్మతులు చేపట్టామన్నారు. గ్రామాభివృద్ధే తన ధ్యేయమని , అభివృద్ధి పనులకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టును సరి చేయాలి

### సబ్ కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి




**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 7:**
తప్పులతడకగా ఉన్న ఓటర్ లిస్టును సరిచేసి నూతన జాబితాను విడుదల చేయాలని మంగళవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. జాబితాలో తీవ్రమైన తప్పులు దొర్లాయని పేర్కొన్నారు. అనేక వార్డులలో చనిపోయిన వ్యక్తుల వివరాలను తొలగించలేదని పేర్కొన్నారు. వార్డులలో నుండి వెళ్లిపోయిన వ్యక్తుల వివరాలను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్ ,కార్యదర్శి రాచర్ల సంతోష్, సీనియర్ నాయకులు గంపల చంద్రమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల మోహన్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, పట్టణ ఉపాధ్యక్షులు సన్నం సుమలత, బాస బోయిన యుగేందర్, గంధం అనిల్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓంసాయి, మాజీ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు కనకం శ్రీనివాస్, ఎర్రోజు శ్రీనివాస్, కోదాటి కళావతి, జంగంపల్లి సాగర్, గోమాస రాజేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## మార్కెట్ బస్టాండ్‌కు

# అన్ని బస్సులు వచ్చేలా కృషి

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి



**జనోదయ మందమర్రి జనవరి 7:**
పట్టణంలోని మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ కు అన్ని బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తానని రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకట స్వామి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంద మర్రి మార్కెట్ నుండి మంచిర్యాల వయా రామకృష్ణాపూర్ షటిల్ బస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణం నుండి మంచిర్యాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ నుండి మంచిర్యాల వయా రామకృష్ణాపూర్ షటిల్ బస్సును ప్రారంభించడం జరిగిందని, దీంతో సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న పట్టణ ప్రజల చిరకాల వాంఛ నేరవేరిందన్నారు. త్వరలోనే మరిన్ని బస్సు సర్వీసులు ప్రారంభించి పట్టణ ప్రజలకు ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగు పరిచి ఆర్టీసీ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కుమార్ దీపక్, మంచి ర్యాల డీసీపీ భాస్కరరావు, మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### తల్లిదండ్రులు హెల్మెట్ , సీటు బెల్టు

## ధరించేలా విద్యార్థులు చూడాలి



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 7:**
పాఠశాలల, కళాశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కాసిం సాహెబ్ సూచించారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఆయన హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. రోడ్లపై నడిచేటప్పుడు, బస్సులలో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. పలుచోట్ల విద్యార్థులతో తమ తల్లిదండ్రులతో వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించేలా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

### మానస కుటుంబ సభ్యులను

## అభినందించిన సీపీ



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 7:**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన వేముల మానస కుటుంబ సభ్యులను బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. వేముల మానవ రామాయణంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు సృష్టించగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఆమె భర్త వేముల శ్రీనివాస్ ఆస్ట్రాలజీ (వాస్తు శాస్త్రం)లో డాక్టరేట్ సాధించారు. ఇటీవలనే ఆమె కుమార్తెలు వేముల వెన్నెల, వేముల శ్రీ నిత్య లు కూచిపూడి నృత్యంలో గిన్నిస్ బుక్ సర్టిఫికెట్లను దక్కించుకున్నారు. కుటుంబంలోని అందరూ వివిధ రంగాల్లో ప్రతిభ చూపడంతో సిపి తన తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందనలు తెలిపారు.




# ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి**



**జనోదయ , గోదావరిఖని డిసెంబర్ 7**

రామగుండం 31వ డివిజన్ ఫ్రెండ్స్ నగర్ కు చెందిన మెదరి గణేష్,మెదరి శివ, మెదరి నరేష్‌లు హై టన్షన్ కరెంట్ తీగలు తగిలి గాయాలపాలైన కు టుంబాలకు బీ.ఆర్. ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాళ్ల హరీష్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ బాధితులకు దురదృష్టవశాత్తు కరెంటు షాక్ తగలడం బాధాకరమని,అలాగే వారికి బీ.ఆర్. ఎస్ పార్టీ తరుపున,హరీష్ రెడ్డి ఫౌండేషన్ తరుపున అండగా ఉంటామని,అలాగే రామగుండం నియోజకవర్గంలో ప్రజలకు కష్టసుఖాల్లో ఎల్లవేళలా బీ.ఆర్.ఎస్ శ్రేణులు, హరీష్ రెడ్డి ఫౌండేషన్ తరుపున భరోసాగా ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గం మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా,బూరుగు వంశీకృష్ణ, తన్నీరు రాకేష్, ఈదునూరి శంకర్, మడిశెట్టి రవి,అల్లి గణేష్,కొండా సురేష్, అనిత,మంగ,దిలకళ రూత, రామగిరి రమేష్,రాము పాల్గొన్నారు.

## మట్టి నమూనాల సేకరణపై విద్యార్థులకు అవగాహన



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 7:**

బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ హై స్కూల్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ హై స్కూల్ విద్యార్థులకు వ్యవసాయ అధికారులు బుధవారం మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మట్టి నమూనాల సేకరణ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏవో, ఏడిఏ పిప రజిత, బెల్లంపల్లి ఏవో ప్రేమ్ కుమార్, ఏఈఓ తిరుపతి, బెల్లంపల్లి కేవీకే ల్యాబ్ ఇన్చార్జి జ్యోతి, ప్రిన్సిపాళ్ళు సత్తయ్య, రఘు కుమార్, విద్యాసాగర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య హై స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**జనోదయ,గోదావరిఖని జనవరి 7:**

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని సంజయ్ గాంధీనగర్‌లో ఉన్న శ్రీ చైతన్య హై స్కూల్ గ్లోబల్ ఎడ్జ్ క్యాంపస్ ముందస్తు సంక్రాంతి సంబరాలతో సందడిగా మారింది. పల్లె సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో నింపాయి. రంగవల్లుల పోటీలు, భోగి మంటలు, పతంగుల ఎగురవేత, సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ బీసీ ప్రజా సంఘం రామగుండం అధ్యక్షుడు పొలవేణి నరేష్, ఉపాధ్యక్షుడు గర్రెందుల శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శి కూసం చరణ్ తేజ హాజరై సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. సంక్రాంతి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, కుటుంబ అనుబంధాలు, ప్రేమానురాగాలు, సామాజిక ఐక్యతను బలోపేతం చేసే మహత్తర పర్వదినమని వారు అన్నారు. భారతదేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమని, వాటిని నేటి తరానికి అందించడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం వారి సౌజన్యంతో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రవి వర్మ, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రావణి, ఏవో సందీప్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. మొత్తం మీద ఈ ముందస్తు సంక్రాంతి సంబరాలు విద్యతో పాటు సంస్కృతికి సమాన ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నంగా నిలిచి, విద్యార్థుల్లో పండుగలపై ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి.



## మంత్రి వివేక్ చేతుల మీదుగా అభివృద్ధి పనులు ప్రారంభం



**జనోదయ, మందమర్రి జనవరి 7:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. బుధవారం పట్టణంలో పర్యటించిన ఆయన ఆర్కే1ఎ సమీపంలో 15 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో చేపడుతున్న క్రిస్టియన్ శ్మశాన వాటిక నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన టవర్ వ్యాగన్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని త్వరలోనే ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభించి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, డిసిసి ప్రెసిడెంట్ పిన్నింటి రఘునాథరెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ అజీజ్‌లు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఆవుల రాజిరెడ్డి

**జనోదయ :నర్సాపూర్:జనవరి 7**



నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్స్‌లో నియోజకవర్గానికి చెందిన 174 మంది లబ్ధిదారులకు రూ.70, 13,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి గారు నేడు లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వేగంగా సహాయం అందజేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం సీఎంఆర్ఎఫ్ నిధులను భారీగా పెంచి, అర్హులైన ప్రతి పేదలకుటుంబానికి వైద్య సహాయం అందించడం హర్షణీయమని అన్నారు.పేదవాడి ఆరోగ్యం దెబ్బతినకుండా ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని, ప్రజా ప్రభుత్వ సంక్షేమ విధానాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చేలా అమలవుతున్నా యని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీమ్ మండల పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ మాజీ అధ్యక్షులు కిష్టయ్య. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైన విద్యార్థి



**జనోదయ,7జనవరి,సంగెం:**

హర్యానాలో 9.1.2026 నుండి12.1.2026 వరకు జరగబోయే జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మొండ్రాయి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థి బైరి లక్ష్మ ప్రసన్న ఎంపికై జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని ప్రధానోపాధ్యాయురాలు విజయ మేడం,ముఖర్జీ, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు కలిసి 5500/రూపాయలు అందించారు. లక్ష్మ ప్రసన్నకు మొండ్రాయి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ విజయ్ ఆర్థిక శుభాకాంక్షలు అందించి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు.

# రాంజీ నీడలో అక్షర సేద్యం

**గిరిజన విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వనవాసి కళ్యాణ పరిషత్**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 7:**

బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన తొలి తరం గిరిజన వీరుడు రాంజీ గోండు విరోచిత త్యాగాన్ని చరిత్రకారులు మరిచిపోయినా నేటికీ అతని స్ఫూర్తిని వనవాసి కళ్యాణ పరిషత్ సంస్థ వేనోళ్ళ చాటుతూనే ఉంది. అటవీ గ్రామాల్లో అభివృద్ధికి దూరంగా ఉంటున్న కోయ, కొలం, గోండు గిరిజన కుటుంబాల్లోని పిల్లల విద్యకు వనవాసి కళ్యాణ పరిషత్ ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ సంస్థ చదువులు కొనలేని ఎంతోమంది గిరిజన విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. దాతల సహకారంతో అక్షర సేద్యాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తోంది. గిరిజనుల విద్య కోసం కంకణం కట్టుకొని ఈ సంస్థకు తమ వంతు చేయూత అందించేందుకు కొన్ని వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తుండడంతో దేశవ్యాప్తంగా 243కు పైగా వనవాసి కళ్యాణ పరిషత్ విద్యార్థి వసతి గృహాలు కొనసాగుతున్నాయి. 1952 వ సంవత్సరంలో మహారాష్ట్రలోని జస్పూర్‌లో స్వర్గీయ బాల సాహెబ్ దేశ్ పాండే కృషితో మొట్టమొదటిగా ప్రారంభమైన ఈ సంస్థ దేశవ్యాప్తంగా వేలాదిమంది గిరిజన విద్యార్థుల జీవితాలను నిలబెడుతోంది. గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న రాంజీ గోండు వనవాసి కళ్యాణ పరి షత్ బెల్లంపల్లి వసతి గృహం పై జనోదయ అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.!

**బెల్లంపల్లిలో 2019లో ప్రారంభం**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, సింగరేణి ప్రాంతమైన బెల్లంపల్లిలో 2007వ సంవత్సరంలో సింగరేణి ఉద్యోగి రాచకొండ రాజేశ్వరరావు రాంజీ గోండు విద్యార్థి నిలయాన్ని స్థాపించారు. 2017వ సంవత్సరం వరకు అతను గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లిల్లూ తిరిగి విద్యార్థులను సమీకరించి రాంజీ గోండు విద్యార్థి నిలయంలో చేరేలా ప్రోత్సహించారు. అతని అంకితభావం, సేవా నిరతి వల్ల నేటికీ ఈ ప్రాంతంలో రాంజీ గోండు విద్యార్థి నిలయం గిరిజన విద్యార్థులకు వసతి కల్పిస్తోంది. రాజేశ్వరరావు తదనంతరం అతని భార్య రాచకొండ విజయలక్ష్మి బెల్లంపల్లిలోని రాంజీ గోండు విద్యార్థి నిలయం అభ్యున్నతిలో భాగస్వాములైంది.

**శిశు మందిర్ పూర్వ విద్యార్థి సంరక్షణలో**

బెల్లంపల్లిలోని వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాంజీ గోండు విద్యార్థి నిలయం బాధ్యతలను శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థి కొమురం తిరుపతి, పుష్పలత దంపతులు పర్యవేక్షిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అరకగూడెం మండలం అల్లేరుగూడెం గ్రామానికి చెందిన కొమరం తిరుపతి భద్రాచలం ప్రాంతంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో టెన్త్ చదివారు. పాఠశాలలో తాను నేర్చుకున్న విలువలను సమాజానికి పెంచాలని చిన్నతనంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్, పీజీ విద్యను హైదరాబాదులో పూర్తి చేసిన అనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి పని చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోని మంచిర్యాల ప్రాంతంలో వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా బెల్లంపల్లిలోని రాంజీ గోండు విద్యార్థి నిలయం బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

**బాసటగా నిలుస్తున్న సింగరేణి, దేవాపూర్ సిమెంట్ కంపెనీలు**

బెల్లంపల్లి ప్రాంతంలో కొనసాగుతున్న రాంజీ గోండు విద్యార్థి నిలయానికి సింగరేణి సంస్థ, కాసిపేట దేవాపూర్ సిమెంట్ కంపెనీలు బాసటగా నిలుస్తున్నాయి. సింగరేణి సంస్థ రాంజీ గోండు విద్యార్థి నిలయానికి క్వార్టర్ తో పాటు విద్యుత్, నీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. సింగరేణి ఏరియా పరిధిలో గల గిరిజన ప్రాంతాల విద్యార్థుల చదువు కయ్యే ఖర్చులను భరిస్తోంది. బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నది. దేవాపూర్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం విద్యార్థుల కోసం రూ 3 లక్షల విలువచేసే నిత్యావసర సరుకులను అందించి ఉదారత చాటుకుంది.

**తెలంగాణలో 7 విద్యార్థి నిలయాలు**

దేశవ్యాప్తంగా 243 రాంజీ గోండు విద్యార్థి నిలయాలు ఉండగా తెలంగాణ ప్రాంతంలో 7 రాంజీ గోండు విద్యార్థి ఆవాస నిలయాలు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్, వరంగల్ (ములుగు), హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, బెల్లంపల్లి, ఇంద్రవెల్లి, నాగర్ కర్నూల్ (అచ్చంపేట) ప్రాంతాల్లో గిరిజన 2 నుండి 8 వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయి. బెల్లంపల్లిలోని వనవాసి కళ్యాణ పరిషత్ రాంజీ గోండు విద్యార్థి నిలయంలో మారుమూల గిరిజన తిర్యాణి, వాంకిడి, జైనూర్, సిర్పూర్ రమెరి, ఆసిఫాబాద్, దహేగాం, కన్నెపల్లి ప్రాంతాలకు చెందిన 35 మంది గిరిజన విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు.






**ప్రతీ నెల ఏకోపాధ్యాయ శిబిరాల నిర్వహణ**

ప్రతీ నెల అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన గ్రామాల్లో ఏకోపాధ్యాయ శిబిరాలను నిర్వహిస్తారు. అక్కడి గిరిజనులకు సేవా కార్యక్రమాలను అందేలా చూస్తారు. సమాజ పోకడలపై అవగాహన సదస్సులు చేపడతారు. నిరక్షరాస్యత, వెనుకబాటు తనానికి గల కారణాలను సదస్సుల్లో వివరిస్తారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందేలా చూస్తారు. ఈనెల కాసిపేట మండలంలో గిరిజన మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు రాంజీ గోండు పూర్వ విద్యార్థి సభ్యులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈనెల 18న గిరిజనుల ఆరాధ్య జాతరగా చెప్పుకునే నాగోబా జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. బెల్లంపల్లి రాంజీ గోండు విద్యార్థి నిలయం అభ్యున్నతికి కమిటీ అధ్యక్షులు రంగ రామన్న, కార్యదర్శి తాటిపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి కాసర్ల తిరుపతి, గౌరవ అధ్యక్షులు కొడిప్యాక విద్యాసాగర్, కోశాధికారి సూరం లక్ష్మనారాయణ, సభ్యులు పాత భాస్కర్, పెద్ది రాజేందర్, ఎర్ర సువర్ణ, దామెర కుమారస్వామిలు ఎంతగానో కృషి చేస్తున్నారు.

**పోలీసు ఉద్యోగానికి ప్రయత్నిస్తున్న**

**(ఆత్రం రామ్షువ్, వాంకిడి)**



మాది వాంకిడి మండలం సోనాపూర్ గ్రామం. నేను టెన్త్ వరకు బెల్లంపల్లిలోని రాంజీ గోండు ఆవాసంలో ఉండి చదువుకున్నాను. ఇక్కడే ఉంటూ మంచిర్యాలలో బీకాం (కంప్యూటర్స్) ఫైనలియర్ చదువుతున్నాను. ప్రస్తుతం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రిపేరవుతున్నాను. నాలాగా ఇక్కడ చదువుకుంటున్న పేద గిరిజన విద్యార్థులకు గైడ్‌గా ఉంటున్నాను. బెల్లంపల్లిలోని రాంజీ గోండు విద్యార్థి నిలయం అందించిన తోడ్పాటుతోనే తాను డిగ్రీ వరకు చదవగలిగాను.

**ఇంటికి వెళ్లాలనిపించదు**

**(సిడం లింగు,అడ దస్నాపూర్)**



నేను బెల్లంపల్లిలోని రాంజీ గోండు విద్యార్థి నిలయంలో ఉంటూ 8 వ తరగతి చదువు కుంటున్న. ఇక్కడ చాలా బాగా చూసుకుంటారు. దాతల సహకారంతో మాలాంటి పేద గిరిజన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పుడు మా ఊరికి కూడా వెళ్లాలనిపించడం లేదు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఇక్కడ క్రమశిక్షణతో కూడిన వాతావరణం ఉంటుంది. ప్రతిరోజు స్టడీ అవర్స్ ఉంటాయి. రాంజీ గోండు విద్యార్థి నిలయం అందిస్తున్న తోడ్పాటుతో బాగా చదువుకుంటా నన్న నమ్మకం ఏర్పడింది. గిరిజనశాఖలో పెద్ద కొలువు సాధిస్తా. నా లాంటి ఎంతో మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు చేయూత నందిస్తా.

# మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

### 12న పీఎస్ఎల్వీ-సీ62 లాంఛ్



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ ఏడాది తొలి ప్రయోగానికి సిద్ధమైంది. జనవరి 12న పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను లాంఛ్ చేయనుంది. ఏపీలోని శ్రీహరి కోటలోని లాంచింగ్ ప్యాడ్ నుంచి 12న ఉదయం 10.17 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఈ రాకెట్ ద్వారా డీఆర్డీవో రూపొందించిన ఈఓఎస్-ఎన్1 శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు.అలాగే, స్పానిష్ కు చెందిన ఒక స్టార్టప్ తయారు చేసిన కిడ్ (స్టైల్ ఇనిషియల్ డెమాన్ స్ట్రేటర్) అనే చిన్న ప్రయోగాత్మక పరికరాన్ని కూడా ఈ రాకెట్ మోస్తుల్లనుంది. దీంతోపాటు ఇండియా, మారిషస్, లక్సెంబర్గ్, యూఏఈ, సింగపూర్, యూరప్, అమె రికా వంటి దేశాలు రూపొందించిన 17 చిన్న ఉపగ్రహాలు, పరికరాల్ని కూడా ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలో ప్రయోగిస్తారు. ఈ ప్రయోగాన్ని ప్రజలు నేరుగానే కాకుండా, డిజిటల్‌గా చూసేందుకు కూడా ఇస్రో ఏర్పాట్లు చేసింది. శ్రీహరికోటలోని ఎస్డీఎస్సీ షార్ వ్యూ గ్యాలరీ నుంచి నేరుగా వీక్షంచే వీలుంది.ఇందుకోసం ప్రజలు ఆధార్ వంటి ఐడీల ద్వారా ఆన్ లైన్లో రిజిష్టర్ చేసుకోవచ్చు. ఇస్రో సంస్థ వరుస ప్రయోగాలతో అంతరిక్ష పరిశో ధనలో దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. విదేశాలకు చెందిన ఉపగ్రహాల్ని కూడా అంతరిక్షంలో ప్రవేశపెడుతూ.. భారీ ఆదాయాన్ని తెచ్చిపెడుతూ సత్తా చాటు తోంది. గత డిసెంబర్లో ఎల్వీఎం3-36 రాకెట్ ప్రయోగించింది.

# సచిన్ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు..

### అర్జున్ టెండూల్కర్ పెళ్లి డేట్ ఫిక్స్



భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలైన సానియా చంధోక్‌తో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిన విషయం తెలిసిందే.అయితే, తాజాగా వీరి పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే అర్జున్ -సానియా వివాహం అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఇరు కుటుంబ సభ్యులు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు టాక్. పలు మీడియా నివేదికల ప్రకారం.. మార్చి 3, 4, 5 తేదీల్లో పెళ్లి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు, కొద్దిమంది క్రికెటర్ల సమక్షంలో జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.టెండూల్కర్ కుటుంబానికి కాబోయే కోడలు సానియాది వ్యాపార నేపథ్యమున్న కుటుంబం. తను సచిన్ తనయ సారాకు మంచి స్నేహితురాలు కూడా. 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి గ్రాడ్యేయేషన్ పూర్తి చేసిన సానియా సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. జంతు ప్రేమికురాలైన తను ముంబైలోనే మిస్టర్ పాస్ పెట్ స్పా, స్టోర్ పేరుతో ఒక బొటిక్ తెరిచింది. సారా ద్వారా అర్జున్‌కు పరిచయం అయిన సనా అతడిపై మనసు పారేసుకుంది. ఈ పేస్ గన్ సైతం ఆమెను ఇష్టపడ్డాడు.

# మున్సిపల్ ఎన్నికలపై కసరత్తు

### ఎస్ఈసీ కీలక ప్రకటన




**హైదరాబాద్, జనవరి 07:** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి12వ తేదీలోపు ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13వ తేదీన టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక జనవరి 16వ తేదీన పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది.బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. ఆన్ లైన్‌లో కూడా ఓటరు నమోదు, మర్పులకు అవకాశం ఇచ్చిందని వివరించింది. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బలఅబశ్రీశ్రీందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీ చేసిన ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టం చేసింది.2026, జనవరి 12వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ..2026, జనవరి 13వ తేదీ వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం..2026, జనవరి 16వ తేదీన ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం.రాష్ట్రవ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించింది. తాజాగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది.

# కలిసి ఎనిమిది ఎన్నికల్లో పోటీ చేశాం..

### డీఎంకేతో పొత్తుపై కాంగ్రెస్



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు 'ఇండియా' కూటమి సిద్ధమని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ తెలిపారు. కాంగ్రెస్, డీఎంకే కలిసే ఉన్నాయని, ఇరుపార్టీల మధ్య ఉన్న చిరకాల భాగస్వామ్యం కొనసాగుతుందని చెప్పారు. తమిళనాడులో 'ఇండియా' కూటమి భాగస్వాముల మధ్య విభేదాలున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టివేశారు.తమిళనాడులో పొత్తుల పరిస్థితిపై బుధవారం నాడిక్కడ మీడియాతో ఆయన మట్లాడుతూ, తమిళనాడు తమకు కీలక రాష్ట్రమని, ఇండియా కూటమి కీలకమైన కూటమి అని అన్నారు. ఇందులో కాంగ్రెస్ భాగస్వామిగా ఉందని, డీఎంకే కీలక భాగస్వామి అని చెప్పారు. తాము కలిసికట్టుగా 8 ఎన్నికల్లో పోటీ చేశామని, కాంగ్రెస్‌కు డీఎంకే చిరకాల మిత్రపక్షమని తెలిపారు.సీట్ల పంపకాల విషయంలో విభేదాలున్నట్టు వస్తున్న వార్తలపై మాట్లాడుతూ, పొత్తుల విషయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలనే విషయాన్ని తాము గుర్తించామన్నారు. సీట్ల కోసం సంప్రదింపులు సాధ్యమైనంత త్వరగా పూర్తికావాలని కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారని, ఎలాంటి జాప్యం జరిగినా పొత్తులపై అపోహలు తలెత్తే అవకాశం ఉండవచ్చని అన్నారు.తమిళనాడులో బీజేపీ రాజకీయ వ్యూహంపై ఠాగూర్ విమర్శలు గుప్పించారు. ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి తమ ఉనికిని పటిష్టం చేసుకోవడమే బీజేపీ వ్యూహమని అన్నారు. ఏదోవిధంగా తమిళనాడులో అడుగుపెట్టాలని బీజేపీ అనుకుంటోందన్నారు. 'ముందు మీతో స్నేహం చేస్తారు. క్రమంగా మీ ఓట్లు తమవైపు తిప్పు కుంటారు. ఆ తర్వాత మీకు ఉనికి లేకుండా చేస్తారు. అన్నాడీఎంకేతో బీజేపీ ఇప్పుడు ఇదే విధానాన్ని తమిళనాడులో అనుసరిస్తోంది' అని విమర్శించారు.

# కుక్కకాట్లపై సుప్రీం ఆందోళన

### జంతువుల సంఖ్య నియంత్రణకు అధికారయంత్రాంగం విఫలం

**ఢిల్లీ:** వీధి కుక్కల సమస్యపై ప్రస్తుతం విచారణ చేపడుతున్న సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, ఎన్వీ అంజారియాలో కూడిన త్రిసభ్య ధర్మాసనం సుమోటోగా విచారణ చేపడుతోంది. దేశంలో కుక్క కాటు కేసుల సంఖ్య పెరగడంపై సుప్రీం ధర్మాసనం బుధవారం ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల సంఖ్య నియంత్రణకు సంబంధించిన నిబంధనల అమలులో అధికార యంత్రాంగం విఫలమైందని వ్యాఖ్యానించింది. వీధి కుక్కల కారణంగా గత 20 రోజుల్లో ఇద్దరు న్యాయమూర్తులు యాక్సిడెంట్ల పాలపడ్డారని ధర్మాసనం పేర్కొంది. వారిలో ఒకరి పరిస్థితి సీరియస్‌గా ఉందని పేర్కొంది. ఇక జంతు హక్కుల కార్యకర్తల తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం వీధి కుక్కలు ఉంటున్న చోటు నుంచి వాటికి షెల్టర్లకు తరలించడం ఈ సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. స్థానికులు షెల్టర్ హోమ్స్ వరకూ వెళ్లి వీధి కుక్కలకు ఆహారం పెట్టరని తెలిపారు. జనావాసాల మధ్య వీధి కుక్కలను అనుమతించాలా వద్దా అన్న అంశం గేటెడ్ కమ్యూనిటీల వెల్ఫేర్ అసోసియేషన్లు నిర్ణయించే అవకాశం ఉండాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. 90 శాతం మంది స్థానికులు వీధి కుక్కలు జనావాసాల మధ్య తిరుగాడటాన్ని వ్యతిరేకిస్తుంటే 10 శాతం మంది అనుకూలంగా ఉన్నారని చెప్పారు. జంతుప్రేమికులమంటూ రేపటి రోజున జనావాసాల మధ్యకు గేదెలను కూడా తీసుకొస్తారని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సీనియర్ అడ్వకేట్లు కేకే వేణుగోపాల్, కోలిన్ గొన్సాల్వెస్, ఆనంద్ గ్రోవర్, సియూ సింగ్ తదితరులు కూడా తమ వాదనలు వినిపించారు. అన్ని వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్క కాటు కేసులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. కుక్కలు ఏ మూడ్‌లో ఉన్నాయో, ఎప్పుడు కరుస్తాయో ఎవరు చెప్పగలరని ప్రశ్నించింది. శునకాల ప్రవర్తన ద్వారా ఏవి ప్రమాదకరమైనవో గుర్తించడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. విద్యాసంస్థలు, హాస్పిటల్స్, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో కుక్క కాటు కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయని చెప్పింది. వీధి కుక్కల రక్షణపై పిటిషన్లు పెరుగుతున్న వైనంపై అసహనం వ్యక్తం చేసింది. 'అందరూ శునకాల గురించే మాట్లాడతారు? కోళ్లు, మేకల గురించి ఎవరూ మాట్లాడరు? వాటివి ప్రాణాలు కావా?' అని ప్రశ్నించింది. ఆయా ప్రాంతాల్లోని కుక్కలు టీకాలు వేయించాలని అధికార యంత్రాంగానికి స్పష్టం చేసింది. రాత్రి సమయాల్లో రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులపైకి జంతువులు రాకుండా చర్యలు తీసుకోవాలని కూడా తేల్చి చెప్పింది. ఈ కేసుపై నేడు కూడా సుప్రీం కోర్టులో విచారణ కొనసాగనుంది.






# ఖమ్మం మంత్రులు ముగ్గురిదీ కమీషన్‌ల కక్కుర్తే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమం జరిగింది. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్ సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కన పెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమీషన్లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు.



# 19న మేడారానికి సీఎం రేవంత్ రెడ్డి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

## హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం

**జనోదయ : హన్మకొండ:**

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష పై హన్మకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం (ఐ డి ఓ సి)లోని సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన 12 నియోజకవర్గాలలో వివిధ అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ నగరాన్ని కూడా అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉం దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వరంగల్ ఎయిర్పోర్టు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఇతర అధికారులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. వరంగల్ ఎయిర్పోర్ట్‌తో పాటు అండర్ డ్రైనేజ్ సిస్టం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ వచ్చినప్పుడు 4వేల కోట్ల పైచిలుకు పరిపాలనపరమైన అనుమతులను ఇవ్వడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా గడచిన వర్షాకాలంలో వరదలు ఎక్కడైతే ఎక్కువగా వచ్చాయో ఆ ప్రాంతంలో భవిష్యత్తు కాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా డ్రైనేజ్ వ్యవస్థను మొదటి దశలో రాబోయే వారం రోజుల్లో టెండర్లను పిలవడం జరుగుతుందన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా తాగునీటి కోసం సుమారు 570 కోట్ల రూపాయలకు టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలో అద్భుతమైన ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న జిల్లాల ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ తర్వాత హెల్త్ హబ్‌గా వరంగల్ నిలుస్తుంద న్నారు. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కొద్ది నెలల్లోనే ఎలా పూర్తి చేయాలని అంశంపై అధికారులతో సమీక్షించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. మధ్యతరగతి ప్రజల స్థాయికి తగినట్లుగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ కార్యక్రమాన్ని వరంగల్‌లో శ్రీకారం చుటనున్నట్లు తెలిపారు. వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన బ్యాలెన్స్ వర్క్ కొంత మిగిలి ఉందని, వాటి పనులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. భద్రకాళి ఆలయానికి సంబంధించి మాఢ వీధుల నిర్మాణ పనులు, మిగతా చెరువు పూడికతీత పనులు, ఆలయ పునరుద్ధరణ పనులు గడువు నిర్ణయించి ఎలా పూర్తి చేయాలనే దానిపై చర్చించినట్లు పేర్కొన్నారు. వరంగల్‌ను హైదరాబాద్ తర్వాత రాజధానిగా రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని, అదే తరహాలో వరంగల్ పట్టణాన్ని మౌలిక వసతులు కల్పించాలని ఉద్దేశంతో అన్ని రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీస్తుళుతున్నట్లు తెలిపారు. సెక్టార్లను ఇక్కడికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆనాడు మధ్యలో వదిలేసిన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కు కూడా వరదలు వచ్చినప్పుడు ముంపునకు గురవుతుందని దానిని కూడా రివైజ్డ్ చేసేందుకు క్షణ్ణంగా సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ కు వచ్చినప్పుడు వరంగల్ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థతో పాటు నాళాలు, రిటైనింగ్ వాల్స్, డిస్చార్జ పాసిటీ రోడ్ల వద్ద కల్వర్టులు లేని కారణంగా పలుచోట్ల ఇల్లు నీట మునిగాయని వాటిపై కూడా చర్చించి కల్వర్టుల నిర్మాణం చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు వరంగల్ పట్టణం ఉమ్మడి వరంగల్ లో అభివృద్ధిలో ముందంజలో ఉండబోతుందన్నారు.





**క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు...**

క్రికెట్ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు( డిపిఆర్) ను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరమైన వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు నిధులు ఎన్ని ఖర్చయినా పారదర్శకంగా వరంగల్ పట్టణం, ఉమ్మడి వరంగల్ జిల్లాను నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అద్భుతంగా.. మహా అద్భుతంగా రాబోయే 200 సంవత్సరాల తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఉండే విధంగా రాతి కట్టడాలతో ఇప్పటికే 95 శాతం ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయినట్లు తెలిపారు.

**జనవరి 28 నుండి 31 వరకు మహా జాతర నిర్వహణ**

మేడారం జాతర ఈనెల 28 నుండి 31 వ తేదీల వరకు జరుగుతుందని చెప్పారు. అమ్మవార్లు ఉన్న ప్రాంతాన్ని పునరుద్ధరణ పనులలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా 250 నుండి 300 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి అద్భుతంగా పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారంలో బస చేయాలని ఈనెల 18వ తేదీన అక్కడికి చేరుకుంటారని, రాత్రి అక్కడే బస చేస్తారని పేర్కొన్నారు. 19వ తేదీన ఉదయం ఆలయ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కోట్లాదిమంది భక్తులు దర్శించుకుంటారని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజనులతో పాటు గిరిజనేతరులు కోట్లాదిమంది భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.


జాతర సందర్భంగా కానీ, జాతర ముందు కానీ, జాతర తర్వాత కాని భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. **మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ...**ఇంటి ఇలవేల్పుగా ఆదివాసీలకే కాకుండా గిరిజనేతరులు, కోట్లాదిమంది భక్తుల కొలువుదీరిన దేవతలు సమ్మక్క సారలమ్మలు అని అన్నారు. కొంగు బంగారం లాగా కోరుకున్న కోరికలు తీరుతున్నాయి కాబట్టి కులము మతము ప్రాంతం అనే భేదాలు లేకుండా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వివిధ వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందన్నారు. గద్దెలతోపాటు ఆలయ ప్రాంగణం పునరుద్ధరణ పనులు మొదలు పెట్టామని.. వాటి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులను ప్రారంభించారని అన్నారు. పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కొండగట్టు ఆలయానికి రూ. కోటి 79 లక్షల హుండీ ఆదాయం రాక

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో ఉన్న కొండగట్టు ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ. కోటి 79 లక్షల 35, 866 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వెల్లడించారు. 84 రోజులకు సంబంధించి ఆలయంలోని 13 హుండీల లెక్కింపు జరుపగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. మిశ్రమ వెండి, బంగారం సీల్ చేసి హుండీలో భద్రపరిచామని వివరించారు. 130 విదేశి కరెన్సీ వచ్చాయని తెలిపారు. జగిత్యాల దేవాదాయ శాఖ పరిశీలకులు రాజమోగిలి పర్యవేక్షణలో ఆలయ ఏఈవో గుండి హరిహరనాథ్, ఆలయ ప్రధా న అర్చకులు రామకృష్ణ, రఘు, ఆలయ



సిబ్బంది, ఏఎస్పై, పోలీసు, సెక్యూరిటీ , బ్యాంక్ సిబ్బంది సమక్షంలో హుండీ లెక్కింపు జరిగిందని కార్యనిర్వహణాధికారి కాంతారావు వెల్లడించారు.



# చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా



దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌ను యువ భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన చివరి వన్డేలో టీమిండియా 233 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. భారత్ ఓపెనర్లు శతకాలతో చెలరేగడంతో సఫారీ జట్టు ముందు భారత్ భారీ టార్గెట్ ఉంచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 393 పరుగులు చేసింది. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ (127) మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి సూపర్ సెంచరీ సాధించాడు. అలానే మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118) కూడా శతకం బాదాడు. అలానే భారత బ్యాటర్లు వేదాంత్ త్రివేది (34), మహ్మద్ ఎనాన్ (28), హెనిల్ పటేల్ (19), అభిజ్ఞాన్ కుందు (21) పరుగులు చేశారు. ఓపెనర్లు వైభవ్, జార్జ్ తొలి వికెట్‌కు 227 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. తాజాగా సెంచరీతో వైభవ్ ఓ వరల్డ్ రికార్డు సృష్టించాడు. యూత్ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్నవయస్కుడైన అండర్-19 కెప్టెన్‌గా ఘనత సాధించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఈ ఫీట్ అందుకు న్నాడు. ఆయుష్ మాత్రే గైర్హాజరీ కావడంతో వైభవ్ తొలిసారి సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సోని మూడు వికెట్లు సాధించగా.. జాసన్ రౌల్స్ 2, మైఖేల్ క్రూయిస్కాంప్ ఒక వికెట్ తీసుకున్నారు. ఇక భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు.. ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. 35 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. పాల్ జేమ్స్ (41), డేనియల్ బోస్మాన్ (40), కార్న్ బోథ (36 ) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. టాప్-4 బ్యాటర్లలో ఒక్కరూ కూడా రెండంకెల స్కోరు చేయలేదు. భారత బౌలర్లలో కిషాన్ కుమార్ సింగ్ 3 వికెట్లు తీశాడు. అలానే మహ్మద్ ఎనాన్ 2, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, ఉదవ్ మోహన్, అంబరీష్, వైభవ్ తలో వికెట్ సాధించారు. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

# ఏప్రిల్ 1 నుంచి జనగణన

**సెప్టెంబర్ 30 వరకు హౌస్ లిస్టింగ్**

**15 రోజుల ముందు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు అవకాశం**

**కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్**

**న్యూఢిల్లీ:** జనాభా లెక్కలు, 2027 తొలి దశ ( హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ ) ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీని కోసం ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతం 30 రోజుల గడువును ప్రకటిస్తాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఈ నోటిఫికేషన్ ప్రకారం, 30 రోజుల హౌస్ లిస్టింగ్ ప్రారంభానికి ముం దు 15 రోజుల్లో సెల్ఫ్ ఎన్యూ మరేషన్‌కు అవకాశం ఉంటుంది. పదేండ్లకో సారి జనాభా లెక్కలను సేకరిస్తారు. 2021లో నిర్వహిం చవలసిన ఈ కార్యక్రమం కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. దేశంలోని ప్రజల సంఖ్య ను ఈ కార్యక్రమంలో సేకరిస్తారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరు గుతుంది. మొదటి దశలో, హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుంది. రెండో దశలో, జన గణన (పాపులేషన్ ఎన్యూమరేషన్) 2027 ఫిబ్రవరిలో జరుగుతుంది. హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ దశలో దేశంలోని అన్ని రకాల ఇండ్లు, కుటుంబాలు, నిర్మాణాల వివరాలను నమోదు చేస్తారు.జనగణన, 2027లో జనాభా లెక్కల సేకరణ దశలో కులాల లెక్కలను కూడా సేకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కుల గణన 1881-1931 మధ్య కాలంలో బ్రిటిష్ పరిపాలనా కాలంలో జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా లెక్కల సేకరణ



నుంచి కులాలను తొలగించారు. నిరుడు ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో సెన్సస్‌లో కులగణనను చేర్చాలని నిర్ణయిం చారు. ఇది మొట్టమొదటి డిజిటల్ సెన్సస్. సుమారు 30 లక్షల మంది ఎన్యూమరేటర్లు జనాభా లెక్కలను సేకరిస్తారు.

# కల్కి-2' షూటింగ్‌కు సిద్ధం

'కల్కి 2898ఏడీ' చిత్రాన్ని ఓ విధంగా భారతీయ వెండితెర సంచలనం అని చెప్పాలి. ఎందుకంటే.. ఫ్రాంచైజీల్లో తొలిభాగం వెయ్యికోట్ల పైచిలుకు వసూళ్లను రాబట్టడం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. ప్రస్తుతం రెండో భాగం కోసం ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే.. ప్రభాస్ 'స్పిరిట్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. అది పూర్తయితే తప్ప ఆయన తర్వాత సినిమా గురించి ఆలోచించే పరిస్థితి లేదు. అందుకే.. 'కల్కి' బృందం షెడ్యూల్స్‌లో మార్పులు చేశారని వినికిడి. కథానుగుణంగా ఈ రెండో భాగంలో కమల్‌హాసన్ పాత్ర చాలా కీలకం. ఆయన పోషించే సుప్రీం యాస్కిన్ పాత్రకి సంబంధించిన సీన్స్ సెకండ్ పార్ట్‌లో ఎక్కువగా ఉంటాయట. అందుకే దర్శకుడు నాగ్ అశ్విన్ 'కల్కి 2' షూటింగ్‌ను కమల్‌హాసన్ పాత్రతో మొదలుపెట్టబోతున్నారట. దీనికోసం కమల్‌హాసన్ నుంచి బల్క్ డేట్స్ కూడా తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌కి వెళ్తుందని తెలిసింది. ఇందులో సుప్రీం యాస్కిన్‌గా కమల్ విశ్వరూపం చూస్తారని చిత్రబృందం చెబుతున్నది. ప్రభాస్ మినహా, మిగతా వారందరితో కమల్ కాంబినేషన్ సీన్స్ తీస్తారట. ఆల్రెడీ సీజీ వర్క్ మొదలైందట. షెడ్యూల్ ప్రకారం సినిమా టాకీ పూర్తయితే.. 2027 చివర్లో విడుదల ఉంటుందని సమాచారం.



## సరికొత్త ప్రేమకథ 'వశం'



చేతన్, కావ్య, రాజీవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వశం'. స్వీయనిర్మాణ దర్శకత్వంలో కోన రమేష్ రూపొందిస్తున్నారు. గిరిజన ప్రాంతంతో పాటు నగర నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇదని, ఆద్యంతం ఆసక్తికరమైన మలుపులతో ఆకట్టుకుంటుందని దర్శకనిర్మాత తెలిపారు. తెలుగు, కన్నడ భాషల్లో ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: శంకర, సంగీతం: కిరణ్ తోటంబ్లే, నిర్మాతలు: కోన రమేష్, యెన్నంశెట్టి ఆంజనేయులు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, కొరియోగ్రఫీ: కోన రమేష్.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 .... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673

# కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

### చెన్నూరులో బీజేపీకి గట్టి షాక్

జనోదయ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి

చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం కాంగ్రెస్ పార్టీ జెండాలతో కళకళలాడింది. బీజేపీ పార్టీ నుంచి మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బత్తుల సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ రాజేష్‌లతో కలిసి సుమారు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ కండువాలు కప్పి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, “నేను ఎమ్మెల్యే అయ్యాక చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి కోసమే ప్రజలు నన్ను గెలిపించారు. ఆ విశ్వాసానికి తగ్గట్లుగానే అనేక అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేశాము” అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ప్రభుత్వమిదని స్పష్టం చేశారు. 50 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, సింగరేణి పవర్ ప్లాంట్‌లో నూతన 850 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు భూమి పూజ, సింగరేణిలో 80 శాతం స్థానికులకే ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం సరఫరా, గత పదేళ్లలో ఇవ్వని రేషన్ కార్డులను అర్హులందరికీ మంజూరు చేస్తున్నామని చెప్పారు. గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. సర్పంచ్‌లకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తామని, వారం రోజుల్లో ప్రొసీడింగ్ కాపీలు తీసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాలని సూచించారు. నియోజకవర్గంలో స్మశానవాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాల్లో ఇప్పుడు అన్ని చోట్ల శ్మశాన వాటికలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చెన్నూరు పట్టణ అభివృద్ధిపై మాట్లాడుతూ.... ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ద్వారా వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు రూ.40 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు



చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన మంత్రి, “రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది గత పాలకులే. మహిళలను, రైతులను కోటీశ్వరులు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. వాళ్లు మాత్రం కోట్ల సంపాదన చేసుకున్నారు” అని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ద్వారా బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో దేశంలోనే ఎక్కువ నిధులు తెచ్చుకున్నారన్న ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సక్రమంగా పని చేసి కాంగ్రెస్ నాయకులను గెలిపించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి స్థాయి హాకీ విజేతగా
# శ్రీరాంపూర్ ఏరియా జట్టు

**విజేత జట్టుకు ట్రోఫీ అందజేసిన జి.ఎం డి లలిత్ కుమార్**

జనోదయ, జైపూర్

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి కంపెనీ స్థాయి హాకీ క్రీడా పోటీలు జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానం నిర్వహించబడుచున్న హాకీ క్రీడా పోటీలు గత రెండు రోజులుగా హోరా హోరిగా తలపడ్డాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో శ్రీరాంపూర్ ఏరియా, మందమర్రి బెల్లంపల్లి ఏరియాల టీమ్ లు తలపడగా ఫైనల్స్ లో శ్రీరాంపూర్ ఏరియా హాకీ క్రీడా కారులు విజేతలుగా నిలిచారు. మందమర్రి బెల్లంపల్లి ఏరియా ద్వితీయ స్థానంలో నిలిచారు. ముగింపు వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతితులుగా ఆర్జీ-1 జిఎం డి. లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ హాజరై విజేతలుగా నిలిచిన శ్రీరాంపూర్ ఏరియా హాకీ క్రీడా కారులకు కంపెనీ స్థాయి హాకీ క్రీడా ట్రోపి 2025-26, బహుమతులను అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మందమర్రి బెల్లంపల్లి ఏరియా లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ... సింగరేణి స్థాయి హాకీ వార్షిక క్రీడా పోటీ ల్లో గత రెండు రోజులుగా హోరా హోరిగా తలపడుతూ విజేతలుగా నిలిచిన శ్రీరాంపూర్ ఏరియా జట్టుకు అభినందనలు తెలిపారు. అలాగే ద్వితీయస్థానంలో నిలిచిన మందమర్రి బెల్లంపల్లి ఏరియా, ఇతర ఏరియాల హాకీ క్రీడాకారులు ఎంతో నైపుణ్యంలో తలపడ్డారని భవిష్యత్తులో మరింత మెళకువ ఓర్పుతో ఆడాలని అభినందనలు తెలిపారు. గెలుపోటములు సహజం కావని ఈ క్రీడ పోటీలు జీవితంలో ఎదుగుదలకు ఆత్మ స్థైర్యానికి దోహద పడతాయని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పొందాలని ఓడిన వారు గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని లోటుపాట్లను సవరించుకొని ముందుకు సాగాలని జిఎం తెలిపారు. సింగరేణి స్థాయి పోటీలలో గెలుపొందిన శ్రీరాంపూర్ జట్టును కోల్ ఇండియా స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. అక్కడ కూడా తమ ప్రతిభ ప్రదర్శించి సింగరేణి స్థాయిని ఇనుమడింపజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటి యుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్ల





య్య, ఎస్ ఓటు జిఎం కే.చంద్ర శేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, ఏ. సురేష్ డిస్ట్రిక్ యూత్ స్పోర్ట్ ఆఫీసర్, డాక్టర్ ఇ. మనోహర్ యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, అధికారుల సంఘం ప్రతినిది పెరుమాళ్ళ శ్రీనివాస్, హనుమంతరావు, శ్రావణ్ కుమార్, ఆనందరావు, ఎం.వీరా రెడ్డి, లేడీస్ క్లబ్ కార్యదర్శి శిరీష చంద్ర శేఖర్, సేవా కార్యదర్శి బీనా సింగ్, రజిత, రెఫరీలు ఎండి.అలియాస్ ఖాన్, అరిఫుల్లా ఇమామ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు కార్పొరేట్ పోనెట్, జాన్ వెస్లీ, పర్స శ్రీనివాసులు, అశోక్, నరేంద్ర రెడ్డి, హెచ్ రమేష్, కో ఆర్డినేటర్ సామల సత్యనారాయణ, సింగరేణి స్థాయి అన్ని ఏరియాల హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

**మంత్రికి వినతి పత్రం అందించిన టేకుమట్ల సర్పంచ్**



జనోదయ, జైపూర్,జనవరి 7

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని టేకుమట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్ వినతిపత్రం అందించారు..ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తానని మాట ఇచ్చినట్లు తెలియజేశారు. ఆర్టీసీని ప్రజల్లోలోకి మరింత చేరువ చేయాలని మంత్రిని కోరడం జరిగింది. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీని మరింత మెరుగుపరచాలని ప్రతి గ్రామ గ్రామాన ఆర్టీసీ బస్ సౌకర్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల గ్రామ సర్పంచ్ బల్ల వెంకటేష్ మరియు వార్డు సభ్యులు జలంపల్లి మల్లేష్, గోనె అశోక్, మాజీ సర్పంచ్ గోనె నర్సయ్య కాంగ్రెస్ నాయకులు ఈగ సురేందర్ పాల్గొన్నారు.

